క్లుప్తంగా

'సమగ్ర శిక్ష' పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

డీఈఓ చంద్రకళ

నరసరావుపేట ఈస్ట్: పల్నాడుజిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ఐఈ కో-ఆర్డినేటర్, అసిస్టెంట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ (ఉర్దూ) పోస్టులకు ఈనెల 14 నుంచి 20వతేదీ సాయంత్రం 5గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 5 సంవత్సరాల అనుభవంతో 55 సంవత్సరాల వయస్సు లోపు ఉన్న స్కూల్ అసిస్టెంట్‌లు అర్హులని తెలిపారు. అభ్యర్థులకు కంప్యూటర్ స్కిల్స్ ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్, సమగ్ర శిక్ష కార్యాలయంలో 20వతేదీ సాయంత్రం 5గంటలలోగా అందజేయాలని తెలిపారు. రెండు పోస్టులకు విడివిడిగా దరఖాస్తు చేయాలని సూచించారు.

కోర్టులో ఒకరికి బదులు మరొకరు సాక్ష్యం

- వన్‌టౌన్‌లో కేసు నమోదు
- నిందితుడు అరెస్ట్

నరసరావుపేటటౌన్: న్యాయస్థానంలో ఒకరికి బదులు మరొకరు సాక్ష్యం చెప్పిన సంఘటనపై కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ విజయ్‌చరణ్ బుధవారం తెలిపారు. సివిల్ కేసులో ఒకరికి బదులు మరొకరు సాక్ష్యం చెప్పి కోర్టును తప్పుదోవ పట్టించే విధంగా ప్రవర్తించారని 13వ అదనపు జిల్లా కోర్టు చీఫ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ తాడికొండ సింహాచలం వన్‌టౌన్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. కాసా మల్లిఖార్జునరావు స్థానంలో సాక్ష్యం చెప్పేందుకు వెళ్లిన డి.కొండ సాంబశివరావుపై కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు

నరసరావుపేటటౌన్: చెల్లని చెక్కు కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష, రూ.1000 జరిమాన విధిస్తూ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి ఆర్.ఆశీర్వాదం పాల్ బుధవారం తీర్పు చెప్పారు. పట్టణానికి చెందిన భరత్ వద్ద హైదరాబాద్‌కు చెందిన కళా వెంకట నాగేశ్వరరావు 2017 మార్చి 14న రూ.8 లక్షలు నగదు అప్పుగా తీసుకున్నాడు. చెల్లింపులో భాగంగా చెక్కు అందజేశాడు. ఖాతాలో నగదు లేకపోవటంతో బాధితుడు కోర్టును ఆశ్రయించాడు. నేరం రుజువు కావటంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

అక్రమ మద్యం విక్రయిస్తే బైండోవర్

రొంపిచర్ల: అక్రమంగా మద్యం విక్రయించడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై కేసులు నమోదు చేయడమే కాకుండా సంబంధిత మండలం తహసీల్దార్ వద్ద బైండోవర్ చేయడం జరుగుతుంది ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటేశ్వర్లు వెల్లడించారు. బుధవారం ఈపూర్ ప్రోహిబిషన్, ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలోని రొంపిచర్ల మండలం తహసీల్దార్ ముందు మద్యం కేసులో ఉన్న రొంపిచర్ల మండల సంతగుడిపాడుకు చెందిన సూర్యనారాయణను హాజరు పరిచి బైండోవర్ చేశారు.

మలుపు భయపెడుతోంది!

- ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి
- కేంద్రియ విద్యాలయ పేరెంట్స్ కమిటీ సభ్యుల వినతి
- రాష్ట్రీయ రహదారిపై స్పీడ్‌బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి



రాష్ట్రీయ రహదారి నుంచి ఇర్లపాడు కేంద్రియ విద్యాలయానికి వెళ్ళే మలుపు ఇదే

నాదెండ్ల: విద్యా సంస్థలు ఉన్న ప్రాంతాల్లో రహదారులపై వాహనాల వేగ నియంత్రణకు జీబ్రా లైన్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కేంద్రియ విద్యాలయం పేరెంట్స్ కమిటీ సభ్యులు కోరుతున్నారు. మండలంలోని ఇర్లపాడు పరిధిలో కేంద్రియ విద్యాలయం ఉంది. చిలకలూరిపేట-నరసరావుపేట రాష్ట్రీయ రహదారి పక్కనే రూ.38 కోట్లతో విద్యాలయాన్ని, రూ.3.20 కోట్లతో స్టాఫ్ క్వార్టర్స్ నిర్మించారు. గతంలో గణపవరం సీఆర్ కళాశాల ప్రాంగణంలోని భవనాల్లో తాత్కాలిక పాఠశాలను నడిపారు. ప్రస్తుతం ఇర్లపాడులో నూతన భవనాలు పూర్తి కావటంతో ఈ విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభమయ్యాయి. 1వ తరగతి నుంచి ఈ ఏడాది పదో తరగతి వరకూ విద్యాబోధన చేస్తున్నారు. 400 మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్న ఈ పాఠశాలకు బస్సులు, ఆటోల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో రాకపోకలు సాగిస్తున్నారు. అయితే ఈ పాఠశాల ఎదురుగా ఉన్న రాష్ట్రీయ రహదారిపై వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా జీబ్రా లైన్లతో పాటూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు జాతీయ రహదారుల సంస్థకు విజ్ఞాపన పత్రం అందించారు. రోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగించే రాష్ట్రీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్‌కు పాఠశాల ప్రిన్సిపల్ విజ్ఞాపన లేఖను అందించారు. రాష్ట్రీయ రహదారి నుంచి పాఠశాల వరకూ డబుల్ లైను రోడ్డు నిర్మించాలని, రెండు ప్రక్కల చెట్లను నాటించాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ నిధులను మంజూరు చేశారు. ఒత్తిడి లేని నాణ్యమైన విద్యాబోధనకు కేంద్రంగా నిలిచిన ఈ విద్యాలయంలో తమ చిన్నారులను చేర్పించేందుకు తల్లిదండ్రులు పోటీ పడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు, గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఇక్కడ విద్యాభ్యాసం చేస్తున్నారు. నిత్యం రాకపోకలు సాగించే సమయాల్లో ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా రహదారిపై స్పీడ్ బ్రేకర్లు, జీబ్రాలైన్లు, స్కూల్ జోన్ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రమాదాలు నివారించాలని విన్నవించాం



2024-25 విద్యా సంవత్సరంలో ఇర్లపాడులోని స్వంత భవనాల్లో కేంద్రీయ విద్యాలయం ప్రారంభమైంది. ప్రస్తుతం సుమారు 400 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. రాష్ట్రీయ రహదారి నుంచి స్కూలుకు వచ్చే మార్గం వద్ద జీబ్రాలైన్లు, స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను తాము కోరాం. ప్రమాదాలు చోటు చేసుకోకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

–ఫరూక్ అహ్మద్, ప్రిన్సిపల్.

ప్రాథమిక దశలోనే మంచి అలవాట్లు నేర్చుకోండి

స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు సువర్ణకుమారి



పాఠశాలకు స్టీల్ ప్లేట్లను బహూకరిస్తున్న ఎస్ సువర్ణకుమారి

యడ్లపాడు: ప్రాథమిక దశనుంచే విద్యార్థుల్లో సమానత్వం, గౌరవం, భావవ్యక్తీకరణ పెంపొందించుకోవాలని స్వచ్ఛందసంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎస్.సువర్ణకుమారి తెలిపారు. మండలం కేంద్రమైన యడ్లపాడు జిల్లా ఉన్నత పాఠశాలలో నరేంద్ర సువర్ణకుమారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషకాహారం, సంపూర్ణ ఆరోగ్యం, నాణ్యమైన ఉచితవిద్య, క్రీడా వికాసం, సురక్షిత నీరు, వ్యక్తిగత-పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం నిమిత్తం 100 స్టీల్ ప్లేట్లను బహూకరించారు. పాఠశాల హెచ్‌ఎం జి విజయకుమారి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్, వైఎస్‌చైర్మన్ రిహాన, జి.శివరామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులు సర్టిఫికేషన్ చేయించుకోవాలి

డీపీఎం కె.అమలకుమారి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీపీఎం అమలకుమారి

నరసరావుపేట రూరల్: ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ప్రతి రైతు సర్టిఫికేషన్ చేయించుకోవాలని డీపీఎం కె.అమలకుమారి తెలిపారు. అంజిరెడ్డి మీటింగ్ హాల్లో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి మూడవ రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమలకుమారి మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది 32,513 మంది రైతులు 42,113 ఎకరాల్లో 30 రకాల విత్తనాలు (పీఎండీఎస్) వేయడం జరిగిందన్నారు. ఆయా రైతులు ప్రస్తుతం ప్రధాన పంటలైన వరి, మిరప, కంది, కూరగాయలు సాగు చేస్తున్నారని తెలిపారు. రైతులు పండించిన పంటలను భాగస్వామ్య హామీ విధానం(పీజీఎస్)లో గ్రూపులుగా చేస్తున్నట్టు చెప్పారు. ఈ గ్రూపులుగా ఏర్పడేందుకు రైతులు ఎటువంటి ప్రకృతి వ్యవసాయ విధానాలు ఆచరించాలో సిబ్బందికి తెలియజేశారు. రైతులు ఈ సర్టిఫికేషన్ చేయడం ద్వారా తాము పండించిన ఉత్పత్తులకు మార్కెట్ ధర కన్నా 15శాతం అధిక ధర లభిస్తుందని తెలిపారు. జిల్లాలోని రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాలు ఆచరించాలని సూచించారు. దీని ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయాన్ని రైతులు పొందవచ్చని తెలిపారు. అంతేకాకుండా వినియోగదారులకు పోషకాలతో కూడిన ఆహార పదార్థాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం ప్రేమ్‌రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సిమ్స్ యాప్‌లో వందశాతం హాజరు ఉండాలి



సాతులూరు హైస్కూలులో రికార్డులు పరిశీలిస్తున్న డీఈవో చంద్రకళ

నాదెండ్ల: సిమ్స్ యాప్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు వంద శాతం ఉండేలా చూడాలని పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ ఆదేశించారు. సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. సిమ్స్ యాప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలను ఆదర్శంగా నిలపాలని కోరారు. విద్యార్థులనుద్దేశించి ఆమె మాట్లాడుతూ క్రమశిక్షణ, ప్రణాళికతో చదివి మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులు, పాఠశాలకు పేరు తేవాలన్నారు. పాఠశాలలో అమలౌతున్న విద్యాబోధన, మధ్యాహ్న భోజనం, హాజరుశాతం వివరాలు తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం అమలు విషయమై ఏజెన్సీ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ తరగతులు ముగిశాక పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు నిర్వహించాలన్నారు. మెరుగైన చేతిరాతకై కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటరావు ఉన్నారు.


16 నాటికి గోకుల షెడ్లు ప్రారంభించాలి



కేంద్రాన్ని పరిశీలిస్తున్న సిద్ధా లింగమూర్తి

యడ్లపాడు: జిల్లాలోని నిర్మాణంలో ఉన్న గోకుల షెడ్లు ఈనెల 16వ తేదీలోగా ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.సిద్ధాలింగమూర్తి చెప్పారు. బుధవారం ఆయన యడ్లపాడు మండలాన్ని సందర్శించారు. మండలంలోని సొలస, చెంఘీజ్‌ఖాన్‌పేట, కొత్తపాలెం, యడ్లపాడు గ్రామాలలో ఉపాధి హామీ పథకం అధికారులతో కలిసి పర్యటించారు. సొలస గ్రామ పంచాయతీలో నిర్మాణంలో ఉన్న గోకుల షెడ్డు నిర్మాణ పనుల్ని, పట్టుపురుగుల పెంపక కేంద్రాన్ని, కొత్తపాలెంలో సేద్యపుకుంట పనుల్ని, యడ్లపాడులోని రూఫ్ హార్వేస్టింగ్ స్ట్రక్చర్ పనుల్ని పరిశీలించారు. అనంతరం యడ్లపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. అన్ని గ్రామ పంచాయతీల్లో సిటిజన్ ఇన్‌ఫర్మేషన్ బోర్డులను ఏర్పాటు చేయాలని, అలాగే ఎఫ్ఏలకు నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు



పుస్తకాలు చదువుతున్న పాఠకులు



చిలకలూరిపేటలో వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తేళ్ల సుబ్బారావు



వినుకొండలో గోడపత్రికలను విడుదల చేస్తున్న మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్



ఈపూరులో కరపత్రాలను అందజేస్తున్న గ్రంథాలయ అధికారి

నరసరావుపేట ఈస్ట్: 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. వారోత్సవాలలో భాగంగా పల్నాడు రోడ్డులోని శాఖా గ్రంథాలయంలో వారం రోజుల పాటు విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించి బహుమతులు అందివ్వనున్నారు. ఈనెల 14వతేదీన బాలల దినోత్సవంతో పాటు మన గ్రంథాలయం అంశంపై చిత్రలేఖనం, 15వ తేదీ సాంకేతిక పరిజ్ఞానంతో విద్యాభివృద్ధి అంశంపై వ్యాసరచన, 16వతేదీ మ్యూజికల్ చైర్, 17వతేదీ సమాజంపై సోషల్ మీడియా ప్రభావం అంశంపై వ్యాసరచన, 18వతేదీ పద్య పోటీ, 19వతేదీన మహిళా దినోత్సవం బాలికలకు రంగోలి (ముగ్గులు) పోటీ, 20వతేదీన వారోత్సవాల ముగింపును పురస్కరించుకుని సభ, బహుమతి ప్రధానోత్సవం నిర్వహించనున్నారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం నుంచి నిర్వహిస్తున్నట్లు స్థానిక గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తేళ్ల సుబ్బారావు తెలిపారు. కార్యక్రమాన్ని పట్టణ పురపాలక సంఘం కమిషనర్ పి శ్రీహరిబాబు వారోత్సవాలను ప్రారంభిస్తారన్నారు. 20వ తేదీ బధవారం మధ్యాహ్నం 12 గంటలకు జరిగే బహుమతి ప్రదాన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని పాల్గొంటారన్నారు. అనంతరం వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. గ్రంథాలయ ఇన్‌చార్జి ఎం నాగుల్ మీరావలి పాల్గొన్నారు.

నాదెండ్లలో....

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్లలో గురువారం నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం కానున్నట్లు శాఖా గ్రంథాలయాధికారి రావూరి శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపీడీవో కార్యాలయం వద్ద జరిగే ప్రారంభ కార్యక్రమానికి ఎంపీపీ తలతోటి రాణి, ఇన్‌చార్జి ఎంపీడీవో స్వరూపారాణి హాజరుకానున్నట్లు తెలిపారు.

యడ్లపాడులో...

యడ్లపాడు: స్థానిక శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ప్రారంభం కానున్నాయని గ్రంథాలయ అధికారి సీహెచ్ అంజమ్మ తెలిపారు. యడ్లపాడు శాఖ గ్రంథాలయంలో ప్రతిరోజు వివిధ అంశాలపై జరిగే కార్యక్రమాల్లో అన్ని పాఠశాలల విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వినుకొండలో...

వినుకొండ(నూజెండ్ల): ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ వారి ఆదేశాల మేరకు వినుకొండ శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో ఈ నెల 14వతేదీ నుంచి 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వినుకొండ శాఖ గ్రంథాలయ ఇంచార్జి అధికారి భూక్యా బద్రీ నాయక్ తెలిపారు. ఈ మేరకు వారోత్సవాలకు సంబంధించిన గోడపత్రికలను మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్, తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో పుట్టారెడ్డి ఆవిష్కరించారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలో భాగంగా నేటి నుంచి ఈనెల 20 వరకు జరుగుతాయని శావల్యాపురం గ్రంథాలయ అధికారి గంగవరపు అర్జున్ బుధవారం తెలిపారు. తొలిరోజు బాలల దినోత్సవం వేడుకలు 15న పుస్తక నిర్వాహణ మాదక ద్రవ్యాలలపై అవగాహన సదస్సు,16న గ్రంథాలయ ఉద్యమ నేతలను స్మరించుకోవటం, 17న కవి సమ్మేళనం సెమినార్లు,18న పాఠశాల విద్యార్థులచే వ్యాసరచన, వకృత్వం, క్విజ్,ఆటలు పోటీలు, 19న మహిళలకు వివిధ రకాల ఆటలు పోటీలు, 20న ముగింపు సందర్భంగా డిజటల్ గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన అనంతరం వివిధ రకాల పోటీల్లోని విజేతలకు బహుమతులు ప్రదానోత్సవం కార్యక్రమాలతో నిర్వహిస్తామన్నారు.

ఈపూరులో...

ఈపూరు: ఈ నెల 14 నుంచి 20 వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ముప్పాళ్ల శాఖా గ్రంథాలయ అధికారిణి ఎస్. నాగలక్ష్మి బుధవారం తెలిపారు. ఈ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ, చిత్రలేఖనం, క్విజ్, క్రీడలు, యోగా ఇతర పోటీలు అవగాహన ర్యాలీలు, పుస్తక ప్రదర్శన వంటి కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

అన్ని పుస్తకాలు అందుబాటులో..



శాఖా గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచాం. దిన, వార, మాస పత్రికలతో పాటు పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులను దృష్టిలో నుంచి వారికి అవసరమైన అన్ని కాంపిటీటివ్ బుక్స్‌ను ఏర్పాటు చేశాం. వీటితో పాటు విద్యార్థులు తమకు ఎక్కువగా అవసరమయ్యే పుస్తకాలను సూచిస్తే వాటిని వెంటనే అందుబాటులోకి తీసుకువస్తున్నాం. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8గంటల వరకు రీడింగ్ రూం తెరిచే ఉంచుతున్నాం.

– యడ్లపాటి రాధ, గ్రంథాలయాధికారి, శాఖా గ్రంథాలయం

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి



విద్యార్థి దశ నుంచే గ్రంథాలయాలను వినియోగించుకోవాలి. ప్రతి విద్యార్థికి అవసరమయ్యే అన్ని రకాల పుస్తకాలు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంటాయి. విద్యా సంస్థల్లోని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తమ పిల్లలలో పఠనాసక్తిని పెంపొందించి గ్రంథాలయాలను సద్వినియోగ పరుచుకునేలా చర్యలు తీసుకోవాలి. ప్రతి సందేహానికి పరిష్కారం గ్రంథాలయాలు చూపుతాయి.

–పి.రామాంజనేయరెడ్డి, గ్రంథాలయాధికారి, శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల

క్రీడలతో శారీరక దృఢత్వం

శావల్యాపురం: క్రీడలతో మానసిక వికాసంతో పాటు శారీరక దృఢత్వానికి దోహదపడతాయని శావల్యాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో స్కూల్ గేమ్స్ విభాగం బాల్ బ్యాడ్మింటిన్ క్రీడా పోటీల్లో మంచి ప్రతిభ చూపిన అండర్-14 బాలికల జట్టు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటిన్ క్రీడా పోటీల్లో అన్నమయ్య జిల్లా కనుమలచెర్వు పోటీల్లో జరిగినట్లు తెలిపారు. ఈ పోటీల్లో యు.లలిత (9వ తరగతి) ఎ.జ్యోతిక (8వ తరగతి) సి.హెచ్.హర్షిత (9వ తరగతి)లు ఎంపికైనట్లు తెలిపారు. జిల్లా నుంచి రాష్ట్రస్థాయి నుంచి జాతీయస్థాయి వరకు క్రీడల్లో రాణించేలా మంచి తర్ఫీదు ఇచ్చిన పాఠశాల పీడీ రాగుల రాధా కృష్ణమూర్తిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ పాటిబండ్ల శ్రావణ్ కుమార్, స్టాఫ్ సెక్రటరీ బెజవాడ నాగేశ్వరరావు, కుమ్మరి శ్రీనివాసరాజు, విమలకుమారి, కవితా, సురేష్, రవి, కిరణ్మయి తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

సీసీఐ ద్వారా పత్తికి మద్దతు ధర

యడ్లపాడు: మండలంలోని పత్తి సాగు చేసిన రైతులు సీసీఐ ద్వారా తమ దిగుబడుల్ని మద్దతు ధరకు విక్రయించుకోవాలని మండల వ్యవసా య అధికారి సీహెచ్ సరిత తెలిపారు. బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ సీసీఐ కేంద్రంలో పత్తి దిగుబడుల్ని విక్రయించే రైతులు ముందుగా తమ సమీపంలోని రైతు సేవా కేంద్రంలో ఈ- క్రాప్, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఆ తర్వాతనే తమ పత్తిని పూర్తిగా ఆరబెట్టి గోనెసంచుల్లో లేదా లూజుగా కేంద్రానికి తీసుకు వెళ్లాలన్నారు. ప్లాస్టిక్‌గోతాల్లో మాత్రం పత్తిని కేంద్రానికి తీసుకెళ్ల రాదని చెప్పారు. 8శాతం తేమ ఉన్న పత్తికి క్వింటాకు రూ.7120 చొప్పున మద్దతు ధర లభిస్తుందన్నారు. అలాగే ప్రస్తుతం సాగులో ఉన్న పత్తిపంట గులాబీ రంగు పురుగు ఆశించకుండా తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు వివరించారు. తక్కువ మోతాదులో పురుగుల మందును వినియోగించుకోవాలని సూచించారు. రబీలో శనగ సాగు చేసుకునే రైతులకు సబ్సిడీపై టి విరిడిని వినియోగించుకుని విత్తనశుద్ధి చేసుకోవడం ద్వారా వేరుకుళ్లు, ఎండు తెగులును నివారించు కోవచ్చన్నారు.

ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలి

నరసరావుపేట ఈస్ట్: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ప్రకటించిన పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ వెంటనే చేపట్టాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా బుధవారం పట్టణంలోని 18వ వార్డులో ఇళ్ల స్థలాలను పంపిణీ చేయాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు పంపిణీ చేయాలని కోరారు. ఇళ్ల స్థలాల పంపిణీని కోరూతూ ఈనెల 18న సచివాలయాల వద్ద ఆందోళన నిర్వహించనున్నట్టు తెలిపారు.

సేవకు ప్రతి రూపం ఇన్నర్‌వీల్ క్లబ్

చిలకలూరిపేట: సేవకు ప్రతిరూపం ఇన్నర్‌వీల్ క్లబ్ అని ఆ క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజిని చెప్పారు. ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట స్థాపించి 38 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా బుధవారం వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ పూర్వ అధ్యక్షులు చిలుకూరి సుబ్బాయమ్మ, ఊర కమలాదేవి, పల్లపోతుల విజయలక్ష్మి, రాచుమల్లు సీతామహాలక్ష్మి, రావికింది పుష్పవతి తదితరులు పాల్గొన్నారు.

మద్యం కేసులో నిందితుడు బైండోవర్

ఈపూరు: ఈపూరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని రొంపిచర్ల మండలం తహసీల్దార్ ఎదుట మద్యం కేసులో ఉన్న వ్యక్తిని హాజరుపరిచి బైండోవర్ చేయడం జరిగిందని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డి. వెంకటేశ్వర్లు తెలిపారు. రొంపిచర్ల మండలం సంతగుడిపాడుకు చెందిన సూర్యనారాయణ అక్రమంగా మద్యం విక్రయించడంతో అతనిపై కేసు నమోదు చేసి తహసీల్దార్ ముందు బైండోవర్ చేశామన్నారు. దుకాణం లైసెన్స్‌దారులు మద్యంను ఎంఆర్‌పీ రేట్లకే విక్రయించాలన్నారు. 21 సంవత్సరాల లోపు వారికి మద్యం విక్రయించరాదని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను పాటించకుంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

సాతులూరులో దేవదాయ శాఖ అధికారి పర్యటన

నాదెండ్ల: దేవదాయ శాఖ ఆధీనంలో ఉన్న ఆలయాలను దేవాదాయ శాఖ పల్నాడు జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆంజనేయులు బుధవారం సందర్శించారు. సాతులూరు గ్రామంలోని గంగాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయం, రామాలయం, రెడ్డిపేరంటాలమ్మ తల్లి ఆలయాలను సందర్శించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివాలయంలో భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలను స్థానికులు ఆయనకు వివరించారు. దీనిపై స్పందించిన ఆయన మాట్లాడుతూ దేవదాయ శాఖ ఆధీనంలోని ప్రతి ఆలయంలో నేమ్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. శివాలయానికి మరమ్మతులు నిర్వహించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని స్థానిక దేవదాయశాఖ అధికారులను ఆదేశించారు. ప్రసన్నాంజనేయ స్వామి ఆలయానికి వెళ్లి అక్కడి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ మంజూష, ఈవో లక్ష్మయ్య, పూజారులు ప్రత్తిపాటి మల్లికార్జునరావు, రాంబాబు, శ్రీధర్, చిలకపాటి భరద్వాజ, నాయకులు పాల్గొన్నారు.